ఉపాధ్యాయుల పాత్ర కీలకం


ఉపాధ్యాయులను సత్కరిస్తున్న యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు

కొరిటెపాడు: భావి భారత పౌరులను తీర్చదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ శ్రీహరి అన్నారు. గుంటూరు ప్రాంతీయ కార్యాలయంలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. వివిధ సంస్థల్లో పని చేసే ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ప్రాంతీయ ప్రతినిధి ఎస్. జవహర్, ఏపీఎస్‌హెచ్ఈ కార్యదర్శి ప్రొఫెసర్ నజీర్ అహమ్మద్, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వీసీ ఆచార్య వై.గంగాధర్‌రావును వారి కార్యాలయాలలో సత్కరించారు. శారదా హైస్కూల్, ఆక్స్‌ఫర్డ్ పాఠశాల, విజ్ఞానంద బాలకుటీర్, ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్స్‌లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో చీఫ్ మేనేజర్ శ్రీహరి శ్రీనివాస కుమార్, మేజర్ బొమ్మెనా హారిక, రిలేషన్‌షిప్ మేనేజర్లు కార్యక్రమంలో పాల్గొన్నారు.

- జేకేసీ కళాశాలరోడ్డులోని డాక్టర్ కేఎల్పీ పబ్లిక్ స్కూల్లో నిర్వహించిన గురుపూజోత్సవంలో పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ జి.రత్తయ్య ఉపాధ్యాయ బృందాన్ని సత్కరించారు.
- మారుతీనగర్‌లోని యాపిల్ స్కూల్లో గురువారం గురుపూజోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల డైరెక్టర్ బి.పేరిరెడ్డి ఉత్తమ ఉపాధ్యాయులు ఎస్.జ్యోతి, పి. సౌజన్య, షేక్ జానీని సన్మానించారు.
- అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో జరిగిన వేడుకలకు ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏఎన్‌యూ ప్రొఫెసర్ కె.రత్నషీలామణిని కళాశాల గౌరవ చైర్మన్ మన్నవ రాధాకృష్ణమూర్తి, చైర్మన్ జూపూడి రంగరాజు, కరస్పాండెంట్ డాక్టర్ కె.మధుసూదనరావు సత్కరించారు.
- జేకేసీ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో అధ్యాపకులను సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, కార్యదర్శి జాగర్లమూడి మురళీమోహన్, పాలకమండలి సభ్యులు కుప్పస్వామి, కొత్రపాటి రామారావు, డాక్టర్ పి.గోపీచంద్, ఎస్ఆర్‌కే ప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.నాగేశ్వరరావు పాల్గొన్నారు.
- సంగడిగుంటలోని గుంటూరు చలమయ్య–కర్పూరపు వెంకట నారాయణ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో కళాశాల ప్రిన్సిపాల్ మహంకాళి శ్రీనివాసరావును కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు పచ్చిపులుసు రాఘవరావు, రామకృష్ణ ప్రభు సత్కరించారు. కార్యక్రమంలో కర్పూరపు సూర్యనారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.
- పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో జరిగిన వేడుకల్లో కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం, పీజీ, డిగ్రీ ప్రిన్సిపాల్స్ కె. అనితాదేవి, ఏబీపీ మనోహర్ పాల్గొని అధ్యాపక బృందాన్ని సత్కరించారు.

ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో గురుపూజోత్సవం

గుంటూరు ఎడ్యుకేషన్: చౌత్రా సెంటర్‌లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో గురువారం జరిగిన గురుపూజోత్సవంలో మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పాఠశాల హెచ్ఎం షేక్ ఎండీ ఖాసిం పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయుడు కిశోర్‌కు సన్మానం

గుంటూరు వెస్ట్: గ్లోబల్ స్పోర్ట్స్ ఫౌండేషన్, గ్లోబల్ స్పోర్ట్స్ మ్యాగజైన్ ఆధ్వర్యంలో గురువారం జాతీయ ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వ్యాయామ ఉపాధ్యాయుడు జి.జె. కిషోర్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్ కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్, జీవీఎస్ ప్రసాద్, నాథ్ వెల్‌నెస్ అధినేత గోపీనాథ్ పాల్గొన్నారు.

గురువులే స్ఫూర్తి ప్రదాతలు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల్లో ప్రేరణ కలిగించే గురువులే స్ఫూర్తి ప్రదాతలని శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ పేర్కొన్నారు. లక్ష్మీపురంలోని సీతారామయ్య పాఠశాలలో గురువారం గురుపూజోత్సవాన్ని నిర్వహించారు. విషువర్ధన్ మాట్లాడుతూ విద్యార్థుల జీవితాన్ని నిర్దిష్ట మార్గంలో తీర్చిదిద్దే వ్యక్తి ఉపాధ్యాయులన్నారు. అనంతరం ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, ప్రైమరీ ప్రిన్సిపాల్ కర్లపూడి పార్వతీదేవి, కో–ఆర్డినేటర్లు డి. దుర్గాశ్యామ్, టి. శ్రీదేవి, విద్యార్థులు పాల్గొన్నారు. విజయవాడ వరద ముంపు బాధితుల సహాయార్థం సీఎం సహాయనిధికి పాఠశాల తరపున రూ50వేలు విరాళాన్ని జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మికి జిల్లా కలెక్టరేట్‌లో కలిసిన విష్ణువర్ధన్ చెక్కు రూపంలో అందజేశారు.


జిల్లా కలెక్టర్ నాగలక్ష్మికి రూ.50వేలు చెక్కు అందజేస్తున్న విష్ణువర్ధన్


యాపిల్ స్కూల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులతో పేరిరెడ్డి


కేఎల్పీ స్కూల్లో కృష్ణప్రసాద్‌ను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ రత్తయ్య, ఉపాధ్యాయులు

చుట్టూ ఉన్నవారి నుంచే ప్రేరణ పొందాలి

గుంటూరు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ టీటీకే రెడ్డి


జీజీహెచ్ ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ సుధీర్‌బాబును సత్కరిస్తున్న భాష్యం రామకృష్ణ, టీటీకే రెడ్డి, హరిత

గుంటూరు ఎడ్యుకేషన్: చుట్టూ ఉన్న సామాన్య వ్యక్తులు వారి జీవితాల్లో సాధించిన విజయాలను ప్రేరణగా తీసుకుని, వారి నుంచి స్ఫూర్తిని పొందడం ద్వారా లక్ష్యాలను చేరుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని గుంటూరు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీటీకే రెడ్డి అన్నారు. గుంటూరు మెడికల్ కళాశాలలోని జింకానా ఆడిటోరియంలో గురువారం భాష్యం మెడెక్స్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న టీటీకే రెడ్డి మాట్లాడుతూ లక్ష్యంపై మక్కువ పెంచుకుని, ఆ దిశగా కృషి చేస్తే విశ్వశక్తి సైతం విజయానికి తోడవుతుందని తెలిపారు. జీజీహెచ్ ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ వి. సుధీర్ బాబు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్పదని పేర్కొన్నారు. భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ తాను ఈస్థాయిలో ఉండటానికి కారకులైన గురువులకు పాదాభివందనం చేస్తున్నానని తెలిపారు. ఈ సందర్భంగా జీజీహెచ్ అభివృద్ధి కోసం ప్రతి యేటా మార్చి ఒకటో తేదీన భాష్యం విద్యాసంస్థల తరపున రూ.రెండు లక్షలు అందిస్తున్నట్లు ప్రకటించారు. తొలుత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అతిథులతో పాటు భాష్యం మెడెక్స్ అధ్యాపకులను భాష్యం రామకృష్ణ, భాష్యం హనుమంతరావు సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

గుంటూరు ఎడ్యుకేషన్: సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని సుమేధ హైస్కూల్ డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. ఎన్జీవో కాలనీలోని సుమేధ హైస్కూల్లో గురువారం గురుపూజోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఆధునిక సమాజంలో ఉపాధ్యాయుని పాత్ర ఎంతో ముఖ్యమైనద తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం కె. రాంబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెబినార్‌లో ఉపాధ్యాయ దినోత్సవం

గుంటూరు ఎడ్యుకేషన్: హిందూ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘ ఆధ్వర్యంలో గురువారం వెబినార్ ద్వారా ''గురు వందనం'' పేరుతో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో ఉన్న 100 మంది పూర్వ విద్యార్థులు నాటి అధ్యాపకులను గుర్తు చేసుకుని వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. కళాశాల పూర్వ విద్యార్థి దశ మొదలు ప్రిన్సిపాల్‌గా పని చేసి ఉద్యోగ విరమణ పొందిన కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతి మంగళ శాసనాలతో కార్యక్రమం ప్రారంభమైంది. కళాశాల కార్యదర్శి చెరువు రామకృష్ణమూర్తి, ప్రిన్సిపాల్ పీఎం ప్రసాద్. ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ పి.వేణుగోపాల్ కార్యక్రమంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. పూర్వ విద్యార్థులైన జీఎస్టీ కమిషనర్ డాక్టర్ రవిశంకర్ తన గురువులు ఏ విధంగా అభివృద్ధికి దోహద పడ్డాడో తెలియజేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.విజయ్‌బాబు ఆంగ్ల ఉపన్యాసకులతో తనకున్న సాన్నిహిత్యాన్ని వివరించారు. ప్రముఖ సంగీత విద్వాంసుడు డాక్టర్ వీఎస్ భార్గవ శాస్త్రి సంగీతంతో అందరినీ అలరించారు. ప్రముఖ చిత్రకారుడు బాజీ చిత్రపటాల ప్రదర్శన, కూచిపూడి కళాకారుడు రాజేష్ నాట్య ప్రదర్శన ఇచ్చారు. ప్రముఖ క్రికెట్ క్రీడాకారుడు అమానుల్లాఖాన్ హిందూ కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగ ప్రతిభ గురించి వివరించారు. వెబినార్‌లో పూర్వ విద్యార్థులు డాక్టర్ రామిరెడ్డి, పి.దత్త ప్రసాద్, డాక్టర్ వరరుచి, డాక్టర్ వై.గౌరీశంకర్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్, పూర్వ విద్యార్థుల సంఘ కార్యదర్శి కేవీఎస్ దుర్గాప్రసాద్, జీవీఎస్ సుబ్రహ్మణ్యం, సుకన్య, శ్రీలేఖ పాల్గొన్నారు.

టీచర్లను సన్మానించిన బీజేపీ నేతలు

గుంటూరు మెడికల్ : ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురువారం గుంటూరు సంపత్‌నగర్ సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో ఉపాధ్యాయులను బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్రకుమార్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా వనమా నరేంద్రకుమార్ మాట్లాడుతూ శిశువును లోకానికి పరిచయం చేసిన అమ్మ మొదటి గురువు అని, నడక నేర్పే నాన్న రెండో గురువు అని పేర్కొన్నారు. లోకంలో శిశువు ఎలా నడుచుకోవాలో నేర్పి విద్యాబుద్ధులు నేర్పే మూడో గురువు ఉపాధ్యాయుడు అన్నారు. కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా సభ్యుడు ప్రదీప్‌కుమార్, పాఠశాల కోశాధికారి కారంశెట్టి రమేష్‌కుమార్, రామలింగేశ్వరరావు పాల్గొన్నారు.

గురువు దైవంతో సమానం

గుంటూరు ఎడ్యుకేషన్: సమాజంలో దైవంతో సమానంగా గురువుకు స్థానం ఉందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. రాజేంద్రనగర్ మెయిన్‌రోడ్డులోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు ఎస్వీ సత్యనారాయణ, రెడ్డి కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ కంజుల సత్యనారాయణ రెడ్డి, ఎస్‌కేబీఎం హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయుడు రాజేంద్ర, ఎన్నారై కళాశాల విశ్రాంత అధ్యాపకుడు పిన్నేటి శివ బాబును ఘనంగా సత్కరించారు. వైఎస్సార్ సీపీ అధ్యాపక విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మోదుగుల వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ సమాజంలో గురువు స్థానాన్ని దైవ సమానంగా మార్చిన మహనీయుడు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినం రోజున గురువులను పూజించుకోవడం ముదావహమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏసీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ పోలే ముత్యం, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు ఉద్దగిరి మురళి, సానికొమ్ము జ్యోతి, ఓం ప్రకాష్, బాలకృష్ణ, రాచకొండ ముత్యాలరాజు, బైరెడ్డి, దేవిరెడ్డి సీతారామరెడ్డి, నాగరాజు, పురుషోత్తం, మస్తాన్ వలి పాల్గొన్నారు.


హిందూ ఫార్మసీ కళాశాలలో రత్నశీలామణిని సత్కరిస్తున్నయాజమాన్యం


చలమయ్య కళాశాలలో ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరావుకు సత్కారం


కెనడీ నెక్ట్స్‌జెన్ కిడ్స్ స్కూల్లో ప్రిన్సిపాల్ హేమలతను సత్కరిస్తున్న డైరెక్టర్ శ్రీకాంత్‌బాబు


సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల అలంకరిస్తున్న హెచ్ఎం ఖాసిం


కిశోర్‌ను సన్మానిస్తున్న విష్ణువర్ధన్, ప్రసాద్, గోపీనాథ్


ఉపాధ్యాయులను సత్కరిస్తున్న మోదుగుల వేణు గోపాల్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, ముత్యం తదితరులు


రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చంద్రశేఖర్ రెడ్డి, విద్యార్థినులు


పూర్వ విద్యార్థుల సమావేశంలో అనుగ్రహ భాషణం చేస్తున్న కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతి


సత్కరించిన ఉపాధ్యాయులతో బీజేపీ నేతలు

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం


కోలా మణికంఠ


మండేపూడి పురుషోత్తం

నెహ్రూనగర్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర అనుబంధ విభాగాల అధ్యక్షులుగా పలువురిని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నియామక ఉత్తర్వులు గురువారం విడుదల చేసింది. గుంటూరు జిల్లాకు చెందిన ఇద్దరికి రాష్ట్ర అనుబంధ విభాగ అధ్యక్షులుగా నియమితులయ్యారు. కృష్ణ బలిజ/పూసల అధ్యక్షులుగా కోలా మణికంఠ, కుమ్మరి శాలివాహన రాష్ట్ర అధ్యక్షుడిగా మండేపూడి పురుషోత్తంను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

యార్డుకు 47,089 బస్తాల మిర్చి

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 47,089 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 46,042 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.7,500 నుంచి రూ. 16,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.7,500 నుంచి 18,600 వరకు లభించింది. ఏసీ కామన్ రకం రూ. 8,000 నుంచి రూ. 16,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 9,000 నుంచి రూ. 18,600 వరకు ధర పలికింది. తాలు రకం రూ.4,500 నుంచి రూ.11,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 24,587 బస్తాలు నిల్వ ఉన్నట్లు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

ప్రభుత్వ ఉత్తర్వులు వెనక్కు తీసుకోవాలి

గుంటూరు మెడికల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖలో స్టాఫ్‌నర్సు పోస్టుల్లో ఏఎన్ఎంలను సర్దుబాటు చేసేందుకు ఈ నెల 4న ఉత్తర్వులు జారీ చేసిందని ఆంధ్రప్రదేశ్ నర్సెస్ స్ట్రగుల్ కమిటీ నేతలు తెలిపారు. ప్రభుత్వం జీవోను వెనక్కు తీసుకోవాలని, లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా విధులు బహిష్కరించి నిరసన తెలిపేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. గత 15 సంవత్సరాలుగా కాంట్రాక్టు పద్ధతిలోనే స్టాఫ్‌నర్సుల నియామకాలు జరుగుతున్నాయని, గత పది సంవత్సరాలుగా రెగ్యులర్ స్టాఫ్‌నర్సుల నోటిఫికేషన్ విడుదల కాలేదన్నారు. ప్రభుత్వం జీవోను వెనక్కు తీసుకుని కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న స్టాఫ్‌నర్సులను రెగ్యులర్ ప్రాతిపదికన నియమించాలని కోరారు. ఈ మేరకు గురువారం గుంటూరు జీజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ సుధీర్‌కు నర్సెస్ స్ట్రగుల్ కమిటీ నేతలు వినతి పత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎస్.కె.కరిష్మ, సి.హెచ్.రత్నరాణి, వై.యామిని, జె.మేరీ, మనీషా, సుజాత, లక్ష్మీకుమారి, నరసింహారావు, అంజమ్మ తదితరులు ఉన్నారు.

పలు రైళ్లు రద్దు

లక్ష్మీపురం: భారీ వర్షాల కారణంగా సౌత్ సెంట్రల్ రైల్వే గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని పలు రైళ్లు రద్దు చేశారు. ఈ మేరకు డివిజన్ సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ గురువారం వెల్లడించారు. నంబర్ 07281 నరసాపూర్–గుంటూరు రైలును ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు రద్దు చేశామన్నారు. నంబర్ 07784 గుంటూరు–రేపల్లె, 07785 రేపల్లె–గుంటూరు, 07976 గుంటూరు–విజయవాడ, 17269 విజయవాడ–నరసాపూర్ రైళ్లు ఈనెల 7, 8, 9వ తేదీ వరకు రద్దయినట్లు చెప్పారు. 07783 విజయవాడ–గుంటూరు, 07779 గుంటూరు–మాచర్ల, 07580 మాచర్ల–నడికుడి, 07579 నడికుడి–మాచర్ల, 07780 మాచర్ల–గుంటూరు, 07788 గుంటూరు–విజయవాడ, 07276 కాచిగూడ–మిర్యాలగూడ, 07277 మిర్యాలగూడ–నడికుడి రైళ్లు ఈ నెల 6,7వ తేదీలలో రద్దు చేశామన్నారు. 07973 నడికుడి–మిర్యాలగూడ, 07974 మిర్యాలగూడ–కాచిగూడ రైళ్లు ఈ నెల 6,7,8వ తేదీలలో రద్దు చేసినట్లు వివరించారు.

బజరంగ్ ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమల పంపిణీ


పంపిణీకి సిద్ధంగా ఉన్న మట్టి వినాయక ప్రతిమలు


అంబటి మురళీకృష్ణ

కొరిటెపాడు: పర్యావరణ హితాన్ని దృష్టిలో పెట్టుకుని ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేయాలని బజరంగ్ సీఈఓ అంబటి మురళీకృష్ణ గురువారం పిలుపునిచ్చారు. రానున్న వినాయక చవితి సందర్భంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్, ఇతర రసాయనాలతో చేసిన వినాయక విగ్రహాలు కాకుండా, ప్రతి ఇంట్లోనూ మట్టి వినాయకుడి విగ్రహాలను పూజించాలన్నారు. మట్టి వినాయక విగ్రహాలను పూజించాలంటూ ఉద్యమం చేపట్టామన్నారు. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు పట్టాభిపురం గ్రీన్ గ్రేస్ ఆవరణలో ప్రధాన ద్వారం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ ద్వారా 6వేల మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేయనున్నామని వెల్లడించారు. పొన్నూరు మండలం మామిళ్ళపల్లి గ్రామంలో మరో వెయ్యి మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేయనున్నామని తెలిపారు. వినాయకపూజలు నిర్వహించబోయే వారందరూ అవకాశాన్ని వినియోగించు కోవాలని కోరారు. ప్రజలందరూ వినాయక చవితి వేడుకలను ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

ఆరోగ్యమే మహాభాగ్యం



గుంటూరు మెడికల్: ఆరోగ్యమే మహాభాగ్యమని, ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబానికి ఏదైనా చేయగలరని హోప్ విన్ హాస్పిటల్స్ చైర్మన్, యువ నారీస్ హెల్త్ కేర్ చైర్మన్ డాక్టర్ షమ సుల్తానా అన్నారు. బైబిల్ మిషన్ 39వ స్త్రీల సంభ్రమ సభలు గత మూడు రోజులుగా పెదకాకానిలో కాకాని స్వస్తిశాలలో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా హోప్ విన్ హాస్పిటల్స్ వ్యవస్థాపకులు, జనరల్ అండ్ లాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ నజీరుద్దీన్, హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ షమ సుల్తానాల ఆధ్వర్యంలో 'స్త్రీలలో సంతానలేమి సమస్యలపై'అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

మరో ఐదుగురు ఎస్ఐలు బదిలీ

నగరంపాలెం: జిల్లాలో మరో ఐదుగురు ఎస్ఐలను బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు వీఆర్‌లో ఉన్న ఎస్ఐలు కె.శివప్రసాదరావును తుళ్ళూరు పీఎస్‌కు, ఇ.రమా దేవిని గుంటూరు మహిళా పీఎస్‌కు, తాడికొండ పీఎస్ ఎస్ఐ డి.రవీంద్రబాబుని గుంటూరు తూర్పు ట్రాఫిక్ పీఎస్‌కు, ఎస్సీ, ఎస్టీ సెల్– నల్లపాడు పీఎస్‌కు అటాచ్‌మెంట్‌గా ఉన్న ఎస్ఐ బి.సాంబశివ నాయక్‌ను గుంటూరు పశ్చిమ ట్రాఫిక్, తెనాలి రూరల్ ఎస్‌హెచ్‌ఓ–1 పీఎస్ ఎస్ఐ పి.కోటేశ్వరరావును తెనాలి రూరల్ ఎస్‌హెచ్‌ఓ–2 పీఎస్‌కు బదిలీ చేశారు.